APTEL /26/A1193

# నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

Gk MEDIA
కావలెను
ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పనిచేయుటకు
జిల్లాల వారిగా
స్టాఫ్ రిపోర్టర్స్, రిపోర్టర్స్ కావలెను
సంప్రదించవలసిన నెం:
9696571571
GK Media Broadcasting Network

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి : 1 సంచిక : 1 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు పేజీలు : 8 బుధవారం 18 ఫిబ్రవరి 2026 వెల : 05/-

## చదువుతో పాటు ఇవి కూడా ఉండాలి

**ఈ మేరకు చంద్రబాబు, లోకేశ్‌లను కోరుతున్నారు**



2లో

- ప్రైవేట్ విద్యార్థుల కోసం 'కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్' ప్రతిపాదన
- ప్రభుత్వ పాఠశాలల మైదానాలను రుసుముతో వాడుకునే అవకాశం
- విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించి, శారీరక ఆరోగ్యాన్ని పెంచడమే లక్ష్యం
- ఫిట్‌నెస్‌లో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆదర్శమన్న నాగబాబు
- చదువుతో పాటు ఆటలు, యోగా తప్పనిసరి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

(ఫిబ్రవరి 17) : విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించి, వారిని శారీరకంగా దృఢంగా తీర్చిదిద్దేందుకు విద్యా వ్యవస్థలో కీలక మార్పులు



## మెక్రాన్‌తో ముంబైలో మోదీ భేటీ

ముంబై, (ఫిబ్రవరి 17) : భారత పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముంబై లో భేటీ అయ్యారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి మెక్రాన్ ముంబైకి వచ్చారు. దీంతో ప్రధాని మోదీ మహారాష్ట్ర లోక్‌భవన్‌కు మంగళవారం మధ్యాహ్నం చేరుకుని మెక్రాన్‌కు సాదర స్వాగతం పలికారు. లోక్‌భవన్ వద్ద ప్రధానికి మహారాష్ట్ర, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ స్వాగతం పలికారు.

ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో సమావేశమయ్యేందుకు ప్రధానమంత్రి మోదీ మహారాష్ట్ర భవన్‌కు చేరుకున్నారని, ఆయనకు సాదర స్వాగతం పలికామని ఆచార దేవ్‌వ్రత్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. మెక్రాన్ తన పర్యటనలో భాగంగా ఫస్ట్ లేడీ బ్రిగిట్టె మెక్రాన్‌తో కలిసి మంగళవారం ఉదయం తేజ్ హోటల్ వద్ద 2008 ముంబై ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. మెక్రాన్ పర్యటనను స్వాగతిస్తూ ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా మంగళవారం ఉదయం పోస్ట్ పెట్టారు. మెక్రాన్‌కు స్వాగతమని, ఈ

2లో

## వైసీపీ నేతల్లారా... సిగ్గుపడండి!

- వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేస్తున్నారని విమర్శ
- హెరిటేజ్‌పై ఆరోపణలకు దమ్ముంటే సభలో ఆధారాలు చూపాలని సవాల్
- జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించిన మంత్రి
- తప్పు చేసిన వారు శిక్ష అనుభవిస్తారని హెచ్చరిక

(ఫిబ్రవరి 17) : తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ నేతలపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ లడ్డూలో కల్తీ జరిగిందని నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డే స్వయంగా ఒప్పుకున్నాక కూడా, వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేయడం దుర్మార్గమని



మిగతా 2వ పేజీలో..

## మార్చి 16నుంచి పట్టాలెక్కనున్న తిరుపతి-పూరి సరికొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లు



తిరుపతి, (ఫిబ్రవరి 17) : వచ్చేనెల 16నుంచి తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు సరికొత్తగా (ఎరుపురంగు) పట్టాలెక్కనున్నాయి. తమిళనాడు పెరంబదూర్‌లో తయారైన ఓ రైలు సోమవారం సాయంత్రం తిరుపతి నుంచి రేణిగుంట మీదుగా నూతన కాంతులతో కళకళలాడుతున్న గ్రీన్ ఇంజన్, ఎరుపురంగులో ఉన్న 20 బోగీలతో దూసుకెళ్లింది. అందులో పైలట్లు, వెనుక సిగ్నల్‌మెన్ తప్ప ప్రయాణికులెవ్వరులేరు. ఖాళీగా దూసుకెళ్తుండడం చూపురులను ఆకట్టుకుంది. ప్రయోగాత్మకంగా కొన్ని కిలోమీటర్లు నడపడంతో పాటు ఎక్కడి నుంచి ప్రవేశపెట్టాలో ఆ ప్రాంతానికి ముందుగానే చేర్చే క్రమంలో ఆ రైలు పరుగులు పెట్టిందని అధికారులు తెలిపారు. 17480 నెంబర్‌తో ప్రతినిత్యం ఉదయం 11.05గంటలకు తిరుపతి నుంచి పూరికి బయల్దేరుతుంది. అలాగే రాత్రి 17479 నెంబర్‌తో రాత్రి 8.05గంటలకు తిరుపతికి చేరుకొని ఆగుతుంది. ఇలా మొత్తం నాలుగు రైళ్లు నడుస్తూ ప్రతిరోజు నిర్దేశిత సమయానికి రాకపోకలు సాగిస్తాయి.

## విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



2లో

అమరావతి, (ఫిబ్రవరి 17) : ఏపీ శాసనసభలో బడ్జెట్‌పై చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడారు. ఈ బడ్జెట్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేదిగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. మూలధన వ్యయాన్ని భారీగా పెంచడం ద్వారా ఆస్తులు సమకూరుతాయన్నారు. రెవెన్యూ లోటును తగ్గించడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తుపై నమ్మకం పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు.

వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగాన్ని పెంచారని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు 50 వేల కోట్లకు పైగా కేటాయించడం ద్వారా ఇది నిజమైన రైతు ప్రభుత్వమని నిరూపించారని పుల్లారావు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు 6 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారని తెలిపారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించే చర్యలు తీసుకున్నారని, రైతు నష్టపోతే రాష్ట్రం నష్టపోతుందని

## ఎమ్మెల్యేలు సభకు రాకపోతే జీతాలు కట్..

### ప్రజలు రీకాల్ చేయాలి



అమరావతి, (ఫిబ్రవరి 17) : ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు (మంగళవారం) గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించారు. మీడియాతో నిర్వహించిన

మిగతా 2లో...

## అన్ని జోన్లలో పర్యటిస్తా.. రోడ్లు శుభ్రంగా లేకపోతే సస్పెండ్ చేస్తా



హైదరాబాద్, (ఫిబ్రవరి 17) : పురపాలక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు (మంగళవారం) కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు సీఎం. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వటైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు.

2లో

## అనకాపల్లి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం

అనకాపల్లి జిల్లా, (ఫిబ్రవరి 17) : అనకాపల్లి జిల్లాలోని పారిశ్రామిక కేంద్రమైన అచ్యుతాపురం జంక్షన్ సమీపంలోని కేఆర్ మార్ట్‌లో ఇవాళ (మంగళవారం) భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. మార్ట్ లోపల అకస్మాత్తుగా మంటలు చెలరేగడాన్ని గమనించిన సిబ్బంది, వినియోగదారులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. మంటలను ఆర్పివేస్తున్నారు. పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.



**షార్ట్ సర్క్యూట్ కారణంగానే...**

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు

2లో



## ఏప్రిల్ మొదటి వారంలో అస్సాం అసెంబ్లీ ఎన్నికలు

గువాహటి, (ఫిబ్రవరి 17) : అస్సాం అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ మొదటి వారంలో జరిగే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకే విడతలో పోలింగ్ జరుగనున్నట్టు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఇంకా తేదీలను ప్రకటించనప్పటికీ మార్చి రెండో వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశాలున్నాయి. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీ గడువు 2026 మే 20వ తేదీతో ముగియనుంది. ఆ తేదీకి ముందే తాజా ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంటుంది. అస్సాం

మిగతా 2లో...

## ఎమ్మెల్యేలు సభకు రాకపోతే జీతాలు కట్.. ప్రజలు రీకాల్ చేయాలి

చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉదయం సభ ఆలస్యంగా ప్రారంభమైందని, దీనికి కారణం సాఫ్ట్‌వేర్ సమస్య అని వెల్లడించారు. 'టెక్నికల్ ప్రాబ్లెమ్ వచ్చినప్పుడు ఎవరు ఏం చేయగలరు? వైసీపీ వాళ్లు ఏదైనా రాజకీయం చేస్తారు. ఇంతకు ముందు ఫేస్ టు ఫేస్ రాజకీయాలు ఉండేవి. ఇప్పుడు వెనకాల నుంచి గుంతలు తవ్వుతున్నారు' అని స్పీకర్ వ్యాఖ్యానించారు. అయితే కోరం పూర్తిగా ఉందని, చాలా మంది సభ్యులు సమయానికి హాజరయ్యారని స్పీకర్ అయ్యన్న తెలిపారు. డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందన్నారు. సభ్యులు అసెంబ్లీకి రావడమే కాకుండా సభలో ఎన్ని గంటలు, నిమిషాలు కూర్చున్నారో కూడా నమోదవుతోందని చెప్పారు. శాసనసభకు రాని వైసీపీ ఎమ్మెల్యేలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. 'విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలి. శాసనసభకు రావటం ఎమ్మెల్యేల విధి. కొందరు అసలు సభకే రాకుండా జీతభత్యాలు తీసుకోవటం తగదు. వారికి జీతం కట్ చేయాలి' అని స్పష్టం చేశారు. ఉద్యోగులు రాకపోతే జీతాలు కట్ చేసి చర్యలు తీసుకునే నిబంధన ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించకూడదని స్పీకర్ ప్రశ్నించారు. విశాఖపట్నంలో జరిగిన సభలో ఈ విషయం ప్రస్తావించగా 80 శాతం ప్రజలు తనతో ఏకీభవించారని స్పీకర్ తెలిపారు. లక్నోలో జరిగిన స్పీకర్ల సమావేశంలో జీతాలు తీసుకుంటూ అసెంబ్లీకి రాని వాళ్లను రీకాల్ చేయాలని సూచించానని చెప్పారు. చాలా దేశాల్లో రీకాల్ విధానం ఉందని, మనది ప్రజాస్వామ్య దేశం కావడంతో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. చిన్న పిల్లల మాక్ అసెంబ్లీ అద్భుతంగా జరిగిందని స్పీకర్ తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేల కంటే వారే బాగా మాట్లాడారని స్పీకర్ ప్రశంసించారు. ప్రస్తుతం పాఠశాలల నుంచి దాదాపు 200 అప్లికేషన్లు వచ్చాయన్నారు. విశాఖ నుంచి రాయలసీమ వరకు వివిధ ప్రాంతాల నుంచి పిల్లలు అసెంబ్లీని చూడడానికి వస్తున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.

## చదువుతో పాటు ఇవి కూడా ఉండాలి... ఈ మేరకు చంద్రబాబు, లోకేశ్‌లను కోరుతున్నాను

తీసుకురావాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కోన నాగబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థుల కోసం 'కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్ (సీజీపీఎస్)' అనే వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఆటస్థలాలు లేక నాలుగు గోడల మధ్యే చదువుకు అంకితమవుతున్న విద్యార్థుల శ్రేయస్సు కోసం ఈ చర్యలు అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, "పిల్లల్లో ఉండే అపారమైన శక్తిని సరైన మార్గంలోకి మళ్లిస్తే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. వారంలో కనీసం మూడు రోజులైనా వారికి ఫిజికల్ ఫిట్‌నెస్, ఆటలు, ఇతర సహ పాఠ్యాంశ కార్యకలాపాల్లో శిక్షణ ఇవ్వాలి. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. దీనివల్ల మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒత్తిడి తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన విషాద సంఘటనలు కూడా ఉన్నాయి. ఆటలు ఆడటం వలన ఈ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ప్రైవేట్ విద్యాసంస్థలకు సొంతంగా ఆటస్థలాలు లేవని, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం విశాలమైన మైదానాలు అందుబాటులో ఉన్నాయని నాగబాబు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో "కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్"ను అమలు చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా జిల్లా పరిషత్, మునిసిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లోని మైదానాలను ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు కూడా ఉపయోగించుకోవచ్చని వివరించారు. దీనికోసం ప్రైవేట్ యాజమాన్యాల నుంచి కనీస రుసుము వసూలు చేయాలని, ఆ మొత్తాన్ని సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య సిబ్బంది నియామకం, మైదానాల నిర్వహణకు వినియోగించాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల మధ్య సత్సంబంధాలు, అవగాహన కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. శారీరక దృఢత్వం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లను ఆయన ఆదర్శంగా చూపారు. "70 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఎంతో చురుకుగా ఉన్నారు. ప్రతిరోజూ యోగా చేస్తూ ఉత్సాహంగా పరిపాలన సాగిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తూనే మార్షల్ ఆర్ట్స్ సాధన కొనసాగిస్తున్నారు. ఇటీవల 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే అంతర్జాతీయ బిరుదు కూడా పొందారు" అని నాగబాబు ప్రశంసించారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన యువత ఈ దేశానికి కావాలి" అన్న స్వామి వివేకానంద మాటలను ఉటంకిస్తూ, మన విద్యార్థులను కేవలం పుస్తకాల పురుగులుగా కాకుండా శారీరకంగా, మానసికంగా బలమైన యువతగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. చదువుతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్, మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్, యోగా వంటివి పాఠ్యాంశాల్లో భాగం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లను సభ ద్వారా కోరుతున్నానని చెబుతూ నాగబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

## జిల్లాలో ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

### –జిల్లా కలెక్టర్ డీకే బాలా



మచిలీ పట్నం ఫిబ్రవరి 17: జిల్లాలో ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత లక్ష్యం మేరకు వచ్చే మార్చి నెల 15వ తేదీలోగా వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 108.44 కోట్ల రూపాయల మేరకు ఉపాధి హామీ పనులు చేపట్టవలసి ఉండగా ఇప్పటివరకు 47 కోట్ల రూపాయల మేరకు పురోగతి సాధించారన్నారు. అందులో 43 శాతం మేరకు బిల్లులను చెల్లింపు కోసం అప్లోడ్ చేశారన్నారు. మిగిలిన 61 కోట్ల రూపాయల పనులను ఎట్టి పరిస్థితుల్లోనైనా మార్చి 15వ తేదీ లోగా పూర్తి చేసి అందుకు సంబంధించిన బిల్లులను అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు మురిగిపోకుండా సకాలంలో సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లోడ్వామ శివప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు, పలువురు ఏపీవోలు డి ఈఈ లు, , ఏఈ లు పాల్గొన్నారు.

## ప్రజా సౌకర్యాలపై నిర్లక్ష్యం తగదు మార్కెట్ యార్డ్ చైర్మన్



పెడన:ఫిబ్రవరి 17 : చెక్ పోస్టుల వద్ద రవాణా తనిఖీలు రికార్డుల నిర్వహణ ప్రజా సౌకర్యాలపై నిర్లక్ష్యం తగదు అని పెడన మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ భీముని అనంతలక్ష్మి అన్నారు. ఈ మేరకు రామరాజు పాలెం చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ చెక్ పోస్టు వద్ద జరుగుతున్న రవాణా తనిఖీలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు సూచిస్తూ, పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. అవసరమైన చోట సౌకర్యాల మెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## అనకాపల్లి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం

అనుమానిస్తున్నారు. మార్ట్‌లోని వస్తువుల్లో ప్లాస్టిక్ సామగ్రి ఉండటంతో మంటలు క్షణాల్లో ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పొగలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించడంతో స్థానికులను అప్రమత్తం చేశారు.

నష్ట నివారణ..

ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మార్ట్‌లోని వస్తువులన్నీ కాలి బూడిదవ్వడంతో లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లి ఉండవచ్చని యాజమాన్యం అంచనా వేస్తోంది. ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది ఇంకా మంటలను పూర్తిగా అదుపు చేస్తున్నారు.

## విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్

ఆయన అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి రూ.91 వేల కోట్లు కేటాయించారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థికి రూ.15 వేలు అందిస్తున్నామని చెప్పారు. అత్యధిక సామాజిక భద్రత పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని అన్నారు. పరిశ్రమలు, ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యధిక పెట్టుబడులు సాధించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారన్నారు. అప్పుల చీకట్లో ఆశాదీపంగా వెలిగిన బడ్జెట్ ఇదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

## ఏప్రిల్ మొదటి వారంలో అస్సాం అసెంబ్లీ ఎన్నికలు

ఎన్నికల్లో పోటీ ప్రధానంగా అధికార బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. అస్సాంలో వరుసగా మూడోసారి అధికార పగ్గాలు చేపట్టి హ్యాట్రిక్ సాధించాలనే పట్టుదలతో బీజేపీ ఉంది. అయితే ఒకప్పుడు తమకు కంచుకోటగా ఉన్న రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పావులు కదుపుతోంది. పార్టీ అగ్రనేతల పర్యటనలను ఖరారు చేస్తూ ముందస్తు ప్రచారాన్ని కూడా మొదలుపెట్టింది.

బీజేపీ సీఎం అభ్యర్థిగా హిమంత

పార్టీ నుంచి రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న హిమంత బిశ్వా శర్మను మరోసారి ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించే అవకాశాలు బలంగా ఉన్నాయి. రాష్ట్రంలో హిమంత బిశ్వా శర్మకు ఉన్న పాపులారిటీ, అట్టడుగు స్థాయి వర్గాల్లో ఆయనకు గట్టిపట్టు ఉండటం పార్టీ విజయావకాశాలను మెరుగు పరుస్తుందని అధిష్టానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అస్సాంలో ఎన్నికల ప్రచార ప్లాన్‌ను కూడా బీజేపీ ఖరారు చేసినట్టు చెబుతున్నారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తదితర ప్రముఖులు రాష్ట్రవ్యాప్తంగా పలు ర్యాలీల్లో పాల్గొననున్నారు.

## వైసీపీ నేతల్లారా... సిగ్గుపడండి!: మండలిలో అచ్చెన్నాయుడు ఫైర్

మండిపడ్డారు. "తప్పు ఒప్పుకున్నాక కూడా బుకాయిస్తారా? వైసీపీ నేతల్లారా సిగ్గుపడండి" అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసి, పవిత్ర ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీకి ధర్మం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో జగన్ తిరుమల పర్యటనను మంత్రి గుర్తుచేశారు. హిందూ సంప్రదాయాల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వడానికి జగన్ ఎందుకు భయపడ్డారని ప్రశ్నించారు. అంతేకాకుండా, హెరిటేజ్ సంస్థపై అడ్డగోలు ఆరోపణలు చేయడం మానుకోవాలని, దమ్ముంటే కనీసం ఒక్క ఆధారమైనా చూపాలని వైసీపీకి సవాల్ విసిరారు. వ్యవస్థలను భ్రష్టు పట్టించి, హిందూ ధర్మంపై దాడులకు పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. సత్యం గెలిచి తీరుతుందని, తప్పు చేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## అన్ని జోన్లలో పర్యటిస్తా.. రోడ్లు శుభ్రంగా లేకపోతే సస్పెండ్ చేస్తా

ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం అడ్వటైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అడ్వటైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒక సారి ఫీజు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. అనధికార అడ్వటైజింగ్ బోర్డులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి దీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ ఉండాలన్నారు. జంక్షన్‌ల వద్ద స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జీహెచ్ఎంసీ విభజన విషయంలో తలెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## మెక్రాన్‌తో ముంబైలో మోదీ భేటీ

పర్యటనలో భారత్-ఫ్రాన్స్ సంబంధాలను మరో స్థాయికి తీసుకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య చర్చలు వివిధ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ పురోగతికి దోహదం చేస్తాయని విశ్వసిస్తున్నామని అన్నారు. ముంబై, ఢిల్లీలో మెక్రాన్‌తో భేటీ అయ్యేందుకు ఎదురుచూస్తున్నట్టు మోదీ పేర్కొన్నారు. మెక్రాన్ భారత్ పర్యటనలో భాగంగా ఈనెల 19న ఢిల్లీలో జరిగే 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో పాల్గొంటారు. మెక్రాన్-మోదీ మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చల్లో భారత్‌కు 114 రఫేల్ యుద్ధ విమానాల సరాఫరాకు ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందం దేశ చరిత్రలోనే అతిపెద్ద రక్షణ ఒప్పందంగా నిలువనుంది.

## ఈ సర్వే కార్యక్రమం సజావుగా నడుస్తోంది

### –జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





మచిలీపట్నం ఫిబ్రవరి 17: జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ సర్వే కార్యక్రమం సజావుగా నడుస్తోందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అవనిగడ్డ నియోజకవర్గంలోని చల్లపల్లి మండలం మాజేరు, కోడూరు మండలం సాలెం పాలెం గ్రామాల్లో పర్యటించి రీ సర్వే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా నోటీసులు ఇచ్చారా లేదా అని విచారించారు. అన్నిటికి రైతులు సానుకూలంగా సమాధానం చెప్పడంతో జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమం ఎలా జరుగుతుందో పరిశీలించేందుకు తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నానన్నారు. రైతులకు భూమిపైన వాస్తవంగా ఎంత భూమి ఉందో నిజనిర్ధారణ చేయుటకు రీ సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ముందుగా రైతులకు నోటీసులు ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. రైతులందరూ సానుకూల ధోరణితో స్పందించారని, మూడు రోజులు ముందుగానే నోటీసులు అందాయని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. నోటీసు అందిన తర్వాత రైతులందరూ వచ్చాక వారి సరిహద్దు పాయింట్లు చూపించాక చివరగా నిర్ధారిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బందికి రికార్డుల పరంగా, భూమిపైన విస్తీర్ణంలో ఏమైనా తేడాలు ఉంటే ప్రభుత్వ నిబంధన మేరకు ఇరువురిని సమన్వయం పరచి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారురైతులందరికీ ఎవరికి ఇబ్బంది లేకుండా రీ సర్వే చేస్తున్నామన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో కొందరి భూములు 22- ఏ నిషేధిత జాబితాలో ఉంచడం వలన రిజిస్ట్రేషన్ లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి ఇప్పటికే తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వం సానుకూలంగా ఉందని త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. సాలెం పాలెం గ్రామంలో కృష్ణా నది కర్రకోడు లో కొంచెం తూములు వేసి నీరు నిలబడడం వలన ఉప్పు నీరంతా కూడా పంట పొలాలకు వచ్చి దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదనతో చెప్పారన్నారు. దీనిని పరిష్కరించడానికి అధికారులతో ఇదివరకే మాట్లాడామని వారు క్షేత్రస్థాయిలో ఎలా పరిష్కారం చేయాలో నివేదిక సమర్పించాలని ఆదేశించామన్నారు. ఆ నివేదిక వచ్చాక తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒక సర్వే నెంబర్ లో ఎంతమంది అయినా ఉండవచ్చు అని ఒక సర్వే నెంబరు పూర్తయితే ఆ సర్వే నెంబర్ లో ఏమైనా ఫిర్యాదులు ఉంటే సంబంధిత రైతుల నుండి ఫిర్యాదులు, అభ్యంతరాలు తీసుకొని అందరి రైతులతో విచారించి వారి స్టేట్మెంట్లను రికార్డు చేసి స్పీకింగ్ ఉత్తర్వులను ఇవ్వాలని సూచించామన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సర్వే భూ రికార్డుల ఏడి లక్ష్మణ్ కోడూరు తహసీల్దారు కిరణ్మయి పలువురు వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఏపీ సీఎం చంద్రబాబుతో మంత్రి తుమ్మల భేటీ

- పునర్విభజనలో ఆంధ్రాలో కలిసిన 5 గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడానికి సహకరించాలని కోరిన మంత్రి తుమ్మల
- తిరుమలలో తెలంగాణ రాష్టానికి 5 ఎకరాల స్థలం కేటాయింపుకు విజ్ఞప్తి
- ఖమ్మంలో టీటీడీ దేవస్థానం నిర్మాణానికి సహకరించండి
- తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయంతో సాగుదాం
- ఖమ్మం జిల్లా పెద్దవాగు మరమ్మత్తుల కోసం అయ్యే ఖర్చులో 85 శాతం నిధులను విడుదల చేయాలని మంత్రి అభ్యర్ధన

సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి కృషి చేయండి

- భద్రాచలం ముంపు బారిన పడకుండా నిర్మించిన కరకట్టకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ లో కలిసిన భాగానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరిన మంత్రి తుమ్మల







అమరావతి, ఖమ్మం, నేటి శుభోదయ :తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసి ఖమ్మం జిల్లాకు సంబంధిచిన సాగునీటి వసతులు, భక్తులు మరియు ప్రజల సౌకర్యానికి సంబంధించిన పలు కీలక విజ్ఞప్తులు చేసారు. రాష్ట్ర పునర్విభనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అయిదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి వివరించారు. యేటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉండటం వల్ల ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈ గ్రామాలు గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంక్లేవ్‌లా మారిపోయాయని, జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి ప్రజలు దాదాపు 8 గంటలు ప్రయాణించాల్సి వస్తోందని మంత్రి పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా అనుసంధానం లోపం, భద్రతా సమస్యలు వంటి అంశాలు స్థానిక గిరిజన ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి సంబంధించిన భూభాగాల్లో కొంత భాగం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటం వల్ల దేవస్థానం పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, భక్తులకు మెరుగైన సేవలు అందించాలంటే ఈ గ్రామాల విలీనం అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఈ చర్య కీలకమని తెలిపారు. అదే విధంగా, ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్ శాశ్వత మరమ్మత్తులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 16,000 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందులో సుమారు 13,640 ఎకరాలు (85.25 శాతం ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 2,360 ఎకరాలు (14.75 శాతం ) తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి అని తెలిపారు. ప్రాజెక్ట్ శాశ్వత పునరుద్ధరణకు సుమారు రూ. 92.20 కోట్ల వ్యయం అంచనా వేయబడిందని, రెండు రాష్ట్రాలకు లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సాగు, జీవనాధారం ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడి ఉన్నందున తక్షణ ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ పరిధిలో గోదావరి వరద రక్షణ కరకట్టలోని 3వ స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్న విషయం కూడా మంత్రి ప్రస్తావించారు. భద్రాచలం పట్టణాన్ని వరదల నుంచి రక్షించేందుకు నిర్మించిన ఈ రక్షణ గోడలో జరిగిన ఈ నష్టం భవిష్యత్తులో భారీ ప్రమాదానికి దారితీయొచ్చని పేర్కొన్నారు. కరకట్టలోని ఆ భాగం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో నిర్వహణలో సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని మంత్రి తెలిపారు. తక్షణ సాంకేతిక పరిశీలన చేసి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, రెండు రాష్ట్రాల సమన్వయంతో శాశ్వత పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి అవసరమైన భూమి గుర్తింపు పూర్తైందని, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రి కోరారు. స్థానిక భక్తుల దీర్ఘకాలిక ఆశయాన్ని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. తిరుమలలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రి ప్రతిపాదించారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో వసతి కొరతను తగ్గించి భక్తులకు సౌకర్యవంతమైన దర్శన అనుభవం కల్పించేందుకు ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం పెంపొందిస్తే సాగునీరు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు మరియు మౌలిక వసతుల విస్తరణలో వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ టాబ్లెట్ వాడాలి





అవనిగడ్డ, ఫిబ్రవరి 17 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) చిన్నారుల కడుపులో నులిపురుగులు ఉంటే పోషకాల లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటుందిని మెడికల్ అధికారిణి పుష్పదీవెన, సర్పంచ్ డాక్టర్ దాసరి విజయకుమార్ లు అన్నారు. మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురష్కకరించుకుని పులిగడ్డలోని గురుకుల పాఠశాల, ఎం. పి. యు. పి పాఠశాలల్లోని విద్యార్థిని విద్యార్థులకు నులిపురుగులను నివారణకు మందులను పంపిణి చేసిన అనంతరం మాట్లాడారు. నులిపురుగులు ఉన్న చిన్నారులకు శరీరక మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని అన్నారు. అందువల్ల అల్బెండజోల్ టాబ్లెట్ ద్వారా నయమవుతుందని మెడికల్ అధికారి సిహెచ్‌ఓ పుష్ప దీవెన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జాన్, ఎంపీయుపి స్కూల్ ప్రధానోపాధ్యాయు రాలు ప్రియాంక, ఉపాధ్యాయురాలు విమల , ఏఎన్ఎం సునీత, లత, ఆశవర్కర్లు నిర్మల, సుబ్బమ్మ , తదితరులు పాల్గొన్నారు.

# నగరి మారుతీ నగర్లో ఆధ్యాత్మిక జ్యోతి ప్రత్యేక పూజలు





నేటి శుభోదయ .చిత్తూరు జిల్లా : నగరి నియోజకవర్గ గుండ్రాజు కుప్పం పంచాయతీ కి సంబంధించిన మారుతీ నగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఓం శక్తి మందిరమునకు ఆధ్యాత్మిక జ్యోతినీ ఘనంగా ప్రత్యేక పూజలు చేసి ఆహ్వానించారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శక్తి వీటి భాస్కర్ మాట్లాడుతూ నగిరి నియోజకవర్గం లో మరియు చిత్తూరు రూరల్ తిరుపతి రూరల్ సంబంధించిన ఓం శక్తి భక్తులు గృహాలకి ఆధ్యాత్మిక జ్యోతి నుండి ప్రత్యేక పూజలు చేసి జ్యోతి నుండి దీపం వెలిగించి మూల మంత్రం చదివి ఆ కుటుంబానికి చెందినవారు అష్ట ఐశ్వర్య ఐశ్వర్యాలతో మరియు ఆయురారోగ్యంతో కుటుంబ సభ్యులందరూ బాగుండాలని సంకల్పం చేసి జిల్లా అధ్యక్షులు టి గంగాధరం అధ్యక్షతన ఈ జ్యోతి పూజలు చేసి ఆధ్యాత్మిక గురువులు పూజ శ్రీ బంగారు అడిగలారు అవతార దినోత్సవం సందర్భంగా మేల్మరువత్తూరు ఆధ్యాత్మిక జ్యోతి ఫిబ్రవరి 28వ తారీఖు ఆధ్యాత్మిక జ్యోతి యాత్ర బయలుదేరుణ అని తెలిపారు ఈ కార్యక్రమంలో మారుతి నగర్ లీడర్లు లోకనాథం శేఖర్ శ్రీనివాసులు సుధాకర్ వెంకటేశులు మరియు ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


# అగ్ని ప్రమాద బాధిత కోర్టు ఉద్యోగికి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ చేయుత





మచిలీపట్నం, ఫిబ్రవరి 17 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) జిల్లా కోర్టు ఉద్యోగి అర్జా లక్ష్మీ ఇంట్లో గ్యాస్ లీకేజ్ తో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. సుమారు 7 లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది. అర్జా లక్ష్మీ తన భర్త సుబ్బారావు ముగ్గురు చిన్నపిల్లలతో కాపురం ఉంటుంది. గ్యాస్ లీకేజీతో ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కట్టుబట్టలతో ప్రాణాలతో బయటపడ్డారు. మంగళవారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ బాధిత కుటుంబానికి నిత్యవసర వస్తువులు, బియ్యం బట్టలు, వంట సామాగ్రి, 5వేల రూపాయలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ గతంలో ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ పరంగా ఇచ్చే 5,000 రూపాయలు రద్దుచేసి కేవలం 25 కేజీలు బియ్యం ఇవ్వటం సమంజసం కాదని అన్నారు. నిజమైన అగ్ని బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా పక్కా ఇల్లు నిర్మించి లక్ష రూపాయలు బ్యాంకు రుణం మంజూరు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. బాధిత కుటుంబానికి మచిలీపట్నంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని బాలాజీ కోరారు. రాబోయే వేసవికాలం పురస్కరించుకొని నగర ప్రజలు విద్యుత్తు షార్ట్ సర్క్యూటివ్ గ్యాస్ లీకేజీ పట్ల అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించుకోవాలని బాలాజీ అన్నారు. మచిలీపట్నం చుట్టుపక్క ప్రాంతాలలో అగ్ని ప్రమాద బాధితులకు గత 15 సంవత్సరాలుగా అండగా ఉంటున్న లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సేవలు ఆదర్శప్రాయమని మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పోతేపల్లి జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ తోట రాజేష్, మాజీ గ్రామ సర్పంచ్ శ్రీపతి చంద్రం, తమన్నఆదిత్య పోతేపల్లి సచివాలయం ఉద్యోగి ప్రభు ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు

# యూరియా సరఫరా పై సమీక్ష నిర్వహించిన శ్రీరాం రాజగోపాల్




ఎన్టీఆర్ జిల్లా , జగ్గయ్యపేట, ఫిబ్రవరి 17 (బేతు రంగ - నేటి శుభోదయం) : జగ్గయ్యపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నియోజకవర్గంలోని సహకార సంఘాల చైర్మన్లు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) యూరియా నిల్వలు మరియు పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాశీ రాజగోపాల్ (తాతయ్య) రైతులకు యూరియా సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన ప్రాంతాలకు తక్షణమే యూరియా పంపిణీ చేయాలని సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ఎక్కడైనా కొరత తలెత్తితే వెంటనే సమాచారం అందించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులు, మార్కెట్ యార్డ్ సిబ్బంది, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాతిపిత, అపరభగీరథుడు,మాజీ సీఎం చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు..



శేరిలింగంపల్లి నీలగిరి వార్త.. మంగళవారం రోజు శేరిలింగంపల్లి నియోజక వర్గం మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ లో తెలంగాణ జాతి పిత, అపర భగీరథుడు, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా, ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాస్ గౌడ్ కేక్ కట్ చేసి, అందరికీ మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమకారులు, పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ ప్రియతమ నాయకుడు కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకున్నారు. లాంగ్ లీవ్ కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు.

# కొత్తగూడెం సీపీఐ మేయర్ గా ఆటో డ్రైవర్ "గణేశ్"





ఖమ్మం, కొత్తగూడెం, నేటి శుభోదయ : ఖమ్మం ఉమ్మడి జిల్లా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌ను సీపీఐ దక్కించుకుంది. ఆ పార్టీకి చెందిన మూడ్ గణేశ్ మేయర్‌గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన లలిత కుమారి ఎన్నికయ్యారు. ఇక్కడ జరిగిన ఎన్నికల్లో మొత్తం 60 స్థానాలకు గాను కాంగ్రెస్ 58 స్థానాల్లో పోటీచేసి పొత్తులో భాగంగా సీపీఎం కు రెండు స్థానాలు కేటాయించింది. ఇక సీపీఐ 57 స్థానాల్లో స్వతంత్రంగా పోటీ చేసింది. బీఆర్ఎస్ 58, బీజేపీ 53, జనసేన 14, బీఎస్పీ 6, ఇతరులు 15, స్వతంత్రులు 91 మంది అభ్యర్థులు పోటీచేశారు. 60 స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 స్థానాల్లో విజయం సాధించాయి. బీఆర్ఎస్ 8 స్థానాలకే పరిమితమయ్యింది. స్వతంత్రులు 6, బీజేపీ, సీపీఎం ఒక్కో స్థానంలో గెలిచాయి.

తెలంగాణా లో గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ సిపిఐ పొత్తులో ఉన్నాయి. అయితే కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికల్లో రెండు పార్టీలకు పొత్తు కుదరలేదు. దాంతో విడివిడిగా పోటీ చేశాయి. ఎన్నికల తర్వాత మేయర్ పదవికి సీపీఐ అభ్యర్థికి మద్దతు ఇచ్చేందుకు బి.ఆర్.ఎస్. పార్టీ ముందుకు వచ్చింది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యంతో సిపిఐ కి కాంగ్రెస్ కు సయోధ్య కుదిరింది. ఆమేరకు సిపిఐ అభ్యర్థి మూడ్ గణేష్ మేయర్ గా ఎన్నికయ్యారు. సాధారణ జీవితంనుంచి నాయకత్వ స్థాయికి సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన గణేశ్ గతంలో ఆటో డ్రైవర్‌గా, ప్రైవేట్ వాహన డ్రైవర్‌గా పనిచేశారు. అదే సమయంలో కార్మిక సమస్యలపై పోరాడుతూ ఏఐటీయూసీ డ్రైవర్ల యూనియన్‌లో చురుకుగా పనిచేశారు. అక్కడి నుంచి రాజకీయాల్లో ఎదిగి, కార్పొరేటర్‌గా గెలిచి ఇప్పుడు మేయర్ స్థాయికి చేరుకున్నారు. సాధారణ కార్యకర్త నుంచి నగర తొలి పౌరుడిగా ఎదిగిన మూడ్ గణేశ్ ప్రయాణం ఇప్పుడు రాజకీయాల్లో ఒక స్ఫూర్తిదాయకమైన ఉదంతంగా మారింది.

# చిన్ననాటి నుంచే ఆరోగ్య పథంలో పయనించాలి

## - జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



ఎన్‌టీఆర్ జిల్లా, పెనుగంచి ప్రోలు, ఫిబ్రవరి 17 ( బేతు రంగా , నేటి శుభోదయ ): పెనుగంచి ప్రోలు జడ్పి హైస్కూల్ విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఆరోగ్య సూత్రాలను పాటించటం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సాధ్యపడుతుందని ప్రతి ఆరు నెలలకు ఒకసారి 1 - 19 సంవత్సరాల వయసున్న పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. చిన్నారుల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమైన నులి పురుగులను నివారించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అల్బెండజోల్ మాత్ర ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చిన్నారులు కూడా శుభ్రతకు సంబంధించి మంచి ఆలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. భోజనానికి ముందు, తరువాత, అడుకున్న తరువాత చేతులను బాగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. శరీరంలో నులిపురుగులు ఉండటం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అన్నారు.

# నేను అడవికి వెళ్ళిపోయానోచ్

## - ఎలా వెళ్లానో తెలిస్తే ఆశ్చర్య పోతారు - గోదావరి "పెద్దపులి" మరో మనో గతం - అందరికీ నమస్కారనండీ



ఏలూరు, నేటి శుభోదయ : నేనండి ఇరవై రోజులు పాటు గోదావరి జిల్లాలలో మీ మధ్యన తిరిగిన పెద్దపులిని. ఏమ్మా... పనీ పాటా లేదా..? నీవు వైజాగ్ జూ లో ఉన్నావ్ కదా. అక్కడ కుదురుగా ఉండకుండా మళ్ళీ మళ్ళీ ఎందుకు వస్తున్నావ్...అని విసుక్కోకండి. నేను ఇప్పుడు వైజాగ్ జూ లో లేను. నాకు ఇష్టమైన అభయారణ్యంలోకి వెళ్ళిపోయాను. కాదు కాదు తీసుకొచ్చి విడిచిపెట్టారు. ఆ విషయం చెప్పడానికే మళ్ళీ మీ ముందుకు వచ్చానండి. అంటే మొన్నోసారి చెప్పాను కదాండి వైజాగ్ వచ్చినప్పుడు జూ కి రండి నీనుంటానని. మీరు వచ్చాకా కనబడకపోతే మాటొచ్చేద్దని చెబుతున్నానండి. నేను ఇకనుండి అడవిలోనే ఉంటానండి. ఓసంతే కదా అనుకోవచ్చు.కాని నేను అడవిలోకి ఎలా వెళ్లాను, ఎలా ఉన్నాను, వంటి విషయాలు మీతో పంచుకోవడానికి మరోసారి వచ్చేనంతేనండి. తూర్పుగోదావరి గోదావరి జిల్లా రాయవరం మండలం కూర్మాపురంలో తుఫాకీ ద్వారా మత్తుమందు ఇచ్చి ఈనెల ఆరున నన్ను పట్టుకోవడం అక్కడి నుంచి వైజాగ్ జూ కి తీసుకెళ్లడం అంతా మీకు తెలిసిందే. అక్కడకి వెళ్లాకా నా మనస్సు కుదురులేదండి.ఏమీ తిన బుద్ది కాలేదండి.ఏవో తాగడానికి పెడితే తాగేనంతేనండి.అక్కడ కూడా ఎలాంటి అల్లరి చేయకుండా చాలా ఒబ్బిడిగా ఉన్నానండి.నేను మగ పులిని అయినప్పటికీ ఎలాంటి అహంకారం ఉండదండి.వారం రోజులపాటు అధికారులు, జూ సిబ్బంది చెప్పినట్లే నడుచుకున్నానండి. నా సత్ప్రవర్తన నచ్చిన అధికారులు నాలాంటి యవ పెద్దపులి జూ లో కంటే అడవిలో ఉంటేనే మంచిదని నిర్ణయించా రండి.అందుకునే నన్ను తీసుకెళ్ళి పాపికొండల నేషనల్ పార్క్ లో మొన్న శనివారం ఉదయం విడిచి పెట్టారండి.దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు అధికారులు విడుదల చేయలేదండి. కారణం నాకూ తెలియదండి.కాని అడవిలో అడుగుపెట్టినప్పుడు కొత్తపెళ్లి కూతురిలా ఎంతో సిగ్గు పడినట్లు చెప్పుకుంటున్నారండి. ఇక నాకు ఈ ప్రజాసమాజం తో సంబంధం లేదంటే కుదరదండి. నా మెడకు జిపిఎస్ ట్రాకర్ ను తగిలించారండి పిల్లి మెడకు గంట కట్టినట్లు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఏ పులికి ఇలాంటి ట్రాకర్ లేదండి. అంటే దీనివల్ల ఏం జరుగుతుంది అనేది కూడా మీకు వివరిస్తానండి. ఈ జిపిఎస్ ట్రాకర్ ద్వారా నేనెక్కడున్నది...? ఎలాగున్నది...? ఆరోగ్య క్షేమ సమాచారం వంటి వివరాలన్నీ ఎప్పటికప్పుడు అధికారులకు తెలిసిపోతూ ఉంటాయండి. అంటే నా ప్రతి కదలిక వారి చేతిలో ఉంటాదండి.దీనికి సంబంధించి వి హెచ్ ఎఫ్ సిగ్నల్స్ ఎప్పటికప్పుడు అధికారులకు అందుతూనే ఉంటాయండి. ఇంత తతంగమంతా ఎందుకంటారా, మరి నేను మహారాష్ట్ర మాడోవా అభయారణ్యం నుంచి దారితప్పి సుమారు 650 కిలోమీటర్ల దూరం పయనించి మీ ప్రాంతానికి వచ్చాను కదండీ, మీ గోదావరి అందాలకు,ఆప్యాయత లకు ముచ్చట పడి మళ్ళీ వచ్చేస్తానమోనని ముందుచూపుతో ఏర్పాటు చేసుంటారండి. ఇదంతా నాకోసమేనండి.అడవులు సురక్షితంగా ఉండాలంటే నేను అడవిలో రాజు లాగా తిరుగుతూ ఉండాలి కదాండి. ఇక్కడే కాదు ఎక్కడైనా అంతేనండి. ఈ అడవుల్లో మా జాతి పుష్కలంగా ఉంటేనే అక్కడంతా క్షేమంగా ఉండగలుగుతుంది. ఆ ఉద్దేశంతోనే నాకిన్ని ఏర్పాట్లు చేశారండి. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటేనండి నాకు "ఎక్స్‌ప్లోరర్" అనే పేరు కూడా పెట్టారండి బాబు. ఇప్పటివరకు అడవుల్లో ఎన్నో పెద్ద పులుల ఉన్నప్పటికీ నాకు మాత్రం ప్రత్యేక స్థానం ఉంటుందండి. ఆపరేషన్ "స్ట్రైప్స్" పేరుతో కూర్మాపురంలో అటవీ శాఖ అధికారులకు దొరికాను.పూణే తదితర ప్రాంతాల నుండి వచ్చినా రెస్క్యూ టీం ఎంతో పకడ్బందీగా నన్ను పట్టుకున్నారు.ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్నారు కదాండి. మా అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఈ అధికారులను ప్రత్యేకంగా అభినందించడం మీకు తెలిసిందే. ఇటువంటి పరిస్థితులలో నా బాగోగులు ఎంతో శ్రద్ధగా అధికారులు చూసుకుంటున్నారండి.మీ గోదావరి జిల్లాలకు వచ్చి ఎంతో పాపులర్ అయిన నాకు ఏమైనా జరిగితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది కదాండి. అందుకునే ఇన్ని జాగ్రత్తలండి.మరో ఆశ్చర్యకరమైన, నమ్మలేని విషయం చెప్పమంటారా, మీ జిల్లాలలో ఇష్టానుసారంగా తిరిగి అలసిపోయిన నేను ఆహారం కోసం వేటాడటం కష్టంగా ఉంటుందని నేను ఉండే ప్రాంతానికి కొన్ని శాఖాహార జంతువులను పంపించే ఏర్పాట్లు కూడా చేస్తున్నారండి.అవన్నీ నాకెలా తెలుసనే కదాండి మీ డౌవుటనుమానం.మరి వారం రోజుల పాటు విశాఖపట్నం జూ లో ఉన్నప్పుడు ఎంతో మంది జంతు సంరక్షకులు పరిచయం అయ్యారండి.వాళ్లే నన్ను అడవులోకి తీసుకెళ్ళినప్పుడు సీక్రెట్ గా నాకు ఈ విషయాలన్నీ చెప్పారండి.అవి మీకు చెబుతున్నాను అంతేనండి. నా మెడలో జిపిఎస్ ట్రాకర్ ఉండటం వల్ల మీతో సంబంధాలు కొనసాగుతూనే ఉంటాయండి. అందువల్ల ఎప్పటికప్పుడు టీవో వోళ్లు లేటెస్ట్ అప్‌డేట్ అంటారు కదాండి.. అలా అందిస్తానండి.ఉంటానండి మరి ఆయ్.

# పవన్ కళ్యాణ్ ఆదర్శం గా తీసుకుని తుమ్మలల్లి రమేష్ డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహణ


## - తుమ్మలపల్లి రమేష్ సొంత ఖర్చులతో గత రెండు సంవత్సరాల నుండి నిర్విరామంగా నిర్వహణ



కాకినాడ జిల్లా జగ్గంపేట ఫిబ్రవరి 17 నేటి శుభోదయ: జగ్గంపేట నియోజకవర్గం జగంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ జనసేన నాయకులతో కలిసి హాజరయ్యి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఆదర్శం గా తీసుకుని డొక్కా సీతమ్మ క్యాంటీన్ పేరుతో నిరుపేద ప్రజలకు భోజనాన్ని అందించే కార్యక్రమం గత రెండు సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నాను అని,పేదవాడి ఆకలి తీర్చడం లో ఉన్న సంతృప్తి ఏ పని లో లేదు అని తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ఈ సందర్బంగా జనసేన నాయకులు మాట్లాడుతుపవన్ కళ్యాణ్ ని స్ఫూర్తి గా తీసుకుని మా నాయకులు తుమ్మలపల్లి రమేష్ తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారని, సేవా కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు. ఈరోజు డొక్కా సీతమ్మ కాంటీన్ ద్వారా సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాదారపు వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరరావు, సత్తి సోమరాజు, అడబాల వీరబాబు, డ్రిల్లు మాస్టారు, శ్రీమన్నారాయణ, రాయి సాయి,వీర మహిళ గన్నెమ్మ ఇతర నాయకులు పాల్గొన్నారు

# నేడే జంబుపట్నం గ్రామంలో 'ప్రవచన చక్రవర్తి' చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనం..!!

## - బుధవారం సాయంత్రం 6 గంటలకు భారీ ఎత్తున ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమం..








కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) : ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనా చక్రవర్తి, నైతిక విలువల ప్రభుత్వ ముఖ్య సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనా కార్యక్రమం బుధవారం సాయంత్రం కోరుకొండ మండలం జంభుపట్నం గ్రామంలో స్థానిక శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి పర్వదిన మహోత్సవాలను పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని గ్రామంలో ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక నాయకులు తెలిపారు. ఈరోజు (బుధవారం) సాయంత్రం జరగనున్న బ్రహ్మశ్రీ కోటేశ్వరరావు ఆధ్యాత్మిక పురాణ కాలక్షేపాన్నికి భారీ సన్నాహాలు చేస్తున్నారు. కోరుకొండ, రాజమహేంద్రవరం, రాజానగరం, సీతానగరం, గోకవరం ప్రాంతాల నుంచి కూడా భక్తులు, మహిళలు, చాగంటి కోటేశ్వరరావు అభిమానులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా నిర్వాహకులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సింగనమల సిహెచ్సిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, ఫిబ్రవరి 17 : సింగనమల మండల కేంద్రంలోని సిహెచ్సిని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. మంగళవారం సిహెచ్సిని తనిఖీ చేసి ఆసుపత్రికి వచ్చిన రోగులతో సేవలు మరియు వైద్యుల సమయాల గురించి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వైద్యులు 24ఐ7 అందుబాటులో ఉన్నారని, సేవలు బాగా అందుతున్నాయని రోగులు తెలిపారు. వార్డుతో పాటు ఆసుపత్రిలోని అన్ని యూనిట్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రి చాలా చక్కగా మరియు బాగా నిర్వహించబడుతుందని మరియు సిహెచ్సి వైద్యుల సేవల పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఓపి నుండి డిశ్చార్జ్ అయ్యేంతవరకు రోగుల సేవల కోసం చీవఞ్+వఅ హాస్పిటల్ పోర్టల్ గురించి మెడికల్ ఆఫీసర్ డా.కే.రోహినాథ్ ని అడిగి తెలుసుకున్నారు. యాప్ ద్వారా పేషెంట్ యొక్క పూర్తి సమాచారం గురించి తెలుసుకోవడం భవిష్యత్తులో సులభంగా మారుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సిహెచ్సి ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శేషారెడ్డి, ఎంపీడీవో, ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

# స్మాల్ సర్కులేషన్ పత్రికల అక్రిడిటేషన్ సమస్యలపై సానుకూల స్పందన

**- నారా ప్రతినిధుల వినతిని స్వీకరించిన సమాచార శాఖ డైరెక్టర్ - జిల్లాల స్థాయి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ**
**- చిన్న పత్రికలకు న్యాయం జరిగే దిశగా ప్రభుత్వ స్థాయిలో చర్చలు ప్రారంభం - సానుకూల పరిణామంగా భావిస్తున్న జర్నలిస్టులు**

విజయవాడ, ఫిబ్రవరి 17: రాష్ట్రవ్యాప్తంగా చిన్న సర్కులేషన్ పత్రికలు ఎదుర్కొంటున్న అక్రిడిటేషన్ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో చర్యలు తీసుకుంటుందని సమాచార ఽ ప్రజా సంబంధాల శాఖ డైరెక్టర్ ఎస్. విశ్వనాథన్ తెలిపారు. విజయవాడలో జరిగిన సమావేశంలో నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ (చీూ=ూ) ప్రతినిధులు సమగ్ర వినతిపత్రం సమర్పించి చిన్న పత్రికల సమస్యలను వివరించారు. నారా ఫౌండర్ ఽ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బండి సురేంద్రబాబు ఆధ్వర్యంలో స్మాల్ సర్కులేటెడ్ పత్రికల ఎడిటర్లు పాల్గొని, ఇటీవల అమల్లోకి వచ్చిన ఎంపానెల్‌మెంట్ నిబంధనల వల్ల చిన్న పత్రికలు అక్రిడిటేషన్‌కు దూరమవుతున్న పరిస్థితిని వివరించారు.

**చిన్న పత్రికల పరిస్థితిపై ఆందోళన**

**ప్రతినిధులు వెల్లడించిన ముఖ్యాంశాలు:**

– గతంలో స్టేట్ హెడ్‌క్వార్టర్స్ అక్రిడిటేషన్ పొందిన అనేక చిన్న పత్రికలు కొత్త ఎంపానెల్‌మెంట్ విధానంతో అర్హత కోల్పోతున్నాయి.

– జిల్లాల వారీగా అమలవుతున్న ప్రమాణాల్లో అసమానతలు కనిపిస్తున్నాయి.

– చిన్న పత్రికలకు 6--7 నెలల అటెండెన్స్ కోరుతూ, పెద్ద పత్రికలకు కేవలం 3 నెలల క్లిప్పింగ్స్ మాత్రమే తీసుకోవడం జరుగుతోంది.

– అటెండెన్స్ నమోదు వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం వల్ల హాజరు ఉన్న రోజులు కూడా నమోదు కాకపోవడం వంటి ఫిర్యాదులు ఉన్నాయి.

– పబ్లికేషన్ సెంటర్‌లో సమర్పించిన హాజరును ప్రామాణికంగా పరిగణించకుండా ప్రతి జిల్లాలో విడిగా ఆధారాలు అడగడం ప్రాయోగికంగా కష్టసాధ్యమవుతోంది.

– గతంలో అమలులో ఉన్న మూడు నెలల పత్రికల సమర్పణ విధానం మార్పులతో చిన్న పత్రికలు సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

– గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే ప్రధాన వేదికలుగా ఉన్న చిన్న పత్రికల కొనసాగింపే ప్రశ్నార్థకంగా మారుతోంది.

**డైరెక్టర్ సానుకూల హామీ**

వినతిని స్వీకరించిన డైరెక్టర్ మాట్లాడుతూ చిన్న పత్రికల సమస్యలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సంబంధిత మంత్రి స్థాయిలో చర్చించి సాధ్యమైన పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని పేర్కొన్నారు. – గతంలో స్టేట్ హెడ్ క్వార్టర్స్ లో అక్రిడిటేషన్ కలిగిన పత్రికలకు భవిష్యత్తు జాబితాల్లో అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. – కమిటీల వ్యవస్థ, అటెండెన్స్ విధానం, ఎంపానెల్‌మెంట్ నిబంధనలపై పునఃపరిశీలన జరుగుతుందని వెల్లడించారు. – చిన్న సర్కులేషన్ పత్రికలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**జిల్లాల స్థాయి సమస్యలపై ప్రత్యేక స్పందన**

జిల్లాల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై డైరెక్టర్ ప్రత్యేకంగా స్పందిస్తూ – జిల్లాల వారీగా స్పెసిఫిక్ సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. – జిల్లా సమాచార శాఖ అధికారులు స్పందించని పరిస్థితుల్లో తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ప్రత్యక్షంగా ఆదేశాలు జారీ చేస్తానన్నారు. – ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, వ్యక్తిగత కారణాల వల్ల కొంతకాలం అటెండెన్స్ లోపించినా చిన్న పత్రికలకు అన్యాయం జరగకుండా సహానుభూతితో వ్యవహరిస్తామని తెలిపారు. – ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన అటెండెన్స్ సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు.

**సమస్యల పరిష్కారానికి నారా సూచనలు**

**నారా ప్రతినిధులు తమ వినతిలో ఈ సూచనలు చేశారు:**

– ఎంపానెల్‌మెంట్‌ను అక్రిడిటేషన్‌కు తప్పనిసరి అర్హతగా పరిగణించకూడదు.

– పత్రికల అనుభవం, నిరంతర ప్రచురణ, విశ్వసనీయతను ప్రధాన ప్రమాణాలుగా తీసుకోవాలి.

– అటెండెన్స్ నమోదు వ్యవస్థను డిజిటల్ విధానంలో పారదర్శకంగా అమలు చేయాలి.

– చిన్న సర్కులేషన్ పత్రికలకు ప్రత్యేక రక్షణాత్మక విధానం రూపొందించాలి.

– జిల్లాల మధ్య తారతమ్య విధానాలను తొలగించి సమాన ప్రమాణాలు అమలు చేయాలి.

**న్యాయం జరుగుతుందనే ఆశాభావం**

సమావేశం అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, చిన్న పత్రికల సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో స్థానిక మీడియా పాత్రను బలపరచే దిశగా ఈ చర్యలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**సమావేశంలో పాల్గొన్న వారు**

ఈ సమావేశంలో నారా ఫౌండర్ & నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బండి సురేంద్రబాబు, క్యాపిటల్ వాయిస్ ఎడిటర్ పి బుచ్చిబాబు, ఈపీపీ కుమార్, గరుడవేగ ఎడిటర్ రమేష్, రాజధాని వాయిస్ ఎడిటర్ పూర్ణచంద్రరావు, ఉమెన్స్ వింగ్ నేషనల్ ప్రెసిడెంట్ మద్దినేని మానస, వివిధ చిన్న సర్కులేషన్ పత్రికల ఎడిటర్లు, ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను వివరించారు. చిన్న పత్రికలకు న్యాయం జరిగే దిశగా ప్రభుత్వ స్థాయిలో చర్చలు ప్రారంభమవడం సానుకూల పరిణామంగా భావిస్తున్నామని సంఘం ప్రతినిధులు తెలిపారు.

# జర్నలిస్టులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ

**- 19వ తారీకు లోపు పేర్లు నమోదు చేసుకోవాలి - మచ్చా రామలింగారెడ్డి**
**- రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జర్నలిస్ట్ డెవలప్మెంట్ సొసైటీ**

అనంతపురం, నేటి శుభోదయ :అనంతపురం జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ టు వీలర్ వాహనం కలిగి ఉన్న వారందరికీ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేయడం జరుగుతుందని ఏపీ జర్నలిస్ట్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ పి జగదీష్ ఇటీవల జిల్లాలో తీసుకున్న అద్భుత నిర్ణయం నో హెల్మెట్ నో పెట్రోల్ కార్యక్రమానికి మద్దతుగా ఎస్పీ మాటలకు అనుగుణంగా జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ హెల్మెట్లు ధరించే విధంగా చూడాలన్న లక్ష్యంతో జర్నలిస్టులు ఎవరు రోడ్డు ప్రమాదానికి గురికాకుండా ఉండాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకున్నామని మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్నిఏపీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ సంయుక్తంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని ప్రతి జర్నలిస్టు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మచ్చా రామలింగారెడ్డి కోరారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో రాప్తాడు, శింగనమల, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణ్ దుర్గం, గుంతకల్, గుత్తి, ఉరవకొండ మండల రిపోర్టర్లు తదితర నియోజకవర్గాల్లో ఉన్నటువంటి పత్రికలు ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్లు, ఫోటోగ్రాఫర్లు, సబ్ ఎడిటర్లు, ప్రింట్ మీడియా, చిన్న పత్రికలు యూట్యూబ్ ఛానల్స్ , సీనియర్ జర్నలిస్టులు, వెటర్న్ జర్నలిస్టులు అందరూవర్కింగ్ జర్నలిస్టులు అందరూ హెల్మెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. ఈనెల19 తారీకు సాయంత్రం ఐదు గంటల లోపు వారి పేర్లు అనంతపురం నగరంలోని అంకుశం పత్రిక కార్యాలయం సప్తగిరి సర్కిల్ వద్దగాని లేదా అనంతపురం నగరంలోని ప్రెస్ క్లబ్ లో వారి పేర్లను నమోదు చేసుకుని వచ్చునని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లాలోని ప్రతి ఒక్క వర్కింగ్ జర్నలిస్టు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి పేర్లను నమోదు చేసుకుని హెల్మెట్ తీసుకోవాల్సిందిగా మచ్చా రామలింగారెడ్డి కోరారు. పేర్లు నమోదు చేసుకున్న వర్కింగ్ జర్నలిస్టుల కు మాత్రమే హెల్మెట్లు ఇవ్వడం జరుగుతుంది గమనించగలరని తెలిపారు. హెల్మెట్ కావాలన్నా వారు నమోదు చేసుకోవాల్సిన వారు ఈ నెంబర్లకి ఫోన్ చేసి వారి వివరాలను నమోదు చేసుకోగలరు ఆధార్ కార్డు మీడియా కార్డు జిరాక్స్ కాపీ అందజేయగలరు

మచ్చా రామలింగారెడ్డి,
చీఫ్ ఎడిటర్ ఎం ఆర్ ఆర్ 69 టివి,
అంకుశం పత్రిక
9849152149,
7386958666.
ఎస్ వెంకటేశ్వర్లు,
రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ
సెల్ ఫోన్ నెంబర్ 95336 33213.
డి రాజగోపాల్
సీనియర్ జర్నలిస్ట్
సెల్ ఫోన్ నెంబర్
9705444590.
ఖ విజయ్ రాజు,
సెక్రెటరీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ కొడిమి జర్నలిస్ట్ కాలనీ
9490062555 లను సంప్రదించాలని సూచించారు.

## యువతలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహిస్తున్న
# తెలుగు దేశం పార్టీ యువ నాయకులు దారెల్లి చిరంజీవి




ఎన్టీఆర్ జిల్లా , వత్సవాయి , ఫిబ్రవరి 17 (బేతురంగా, నేటి శుభోదయ) : వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామం లో మహాశివరాత్రి సందర్భంగా గ్రామ స్థాయి కబడ్డీ మరియు షటిల్ పోటీలు నిర్వహించి గెలిచిన వారికి నగదు బహుమతి అందించిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు దారెల్లి చిరంజీవి ఈ సందర్భంగా దారెల్లి చిరంజీవి మాట్లాడుతూ యువత క్రీడలలో ముందు ఉండి సొంత ఊరికి సొంత తల్లి దండ్రులకు పేరు తీసుకొని రావాలని, అలాగే బాగా చదువు కొని మంచి పేరు తీసుకొని రావాలని, గ్రామంలో యువతకు తన వంతుగా ప్రోత్సాహం ఉంటుందని యువతను ప్రోత్సాహంచటానికి, గ్రామ అభివృద్ధి కి ఇలాంటి కార్యక్రమలను చేయటం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు, యువత గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు.. అలాగే గ్రామ యువత చిరంజీవి చూపిస్తున్న చొరవకు చాలా సంతోషం వ్యక్తం చేశారు.

# విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిపై నిందితులు గుంపుగా దాడి చేసిన ఘటనపై కేసు నమోదు


**- కోరుకొండ ఎస్.ఐ. శ్రీనివాస్..**




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) :తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిపై నిందితులు గుంపుగా దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు కోరుకొండ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించడం జరిగిందన్నారు. పోలీస్ విధుల్లో ఆటంకం కలిగించే లేదా దాడులకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నామని, ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్.ఐ. శ్రీనివాస్ విజ్ఞప్తి చేసారు.

# ముక్త్యాల గ్రామములో శ్రీ భవానీ ముక్తేశ్వరస్వామి వారి దేవస్థానముపారువేట ఉత్సవం, అమ్మవారికి కుంకుమార్చన, ధ్వజావరోహణ కార్యక్రమం

ఎన్టీఆర్ జిల్లా , జగ్గయ్యపేట, ఫిబ్రవరి 17 (బేతు రంగా, నేటి శుభోదయ) : జగ్గయ్యపేట మండలం, ముక్త్యాల గ్రామములో పావన కృష్ణానది తీరమున వేంచేసియున్న శ్రీ భవానీ ముక్తేశ్వరస్వామి వారి దేవస్థానము నందు మాఘ బహుళ దశమి గురువారం అనగా ది.12-02-2026 నుండి ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవములలో భాగంగా ది. 15-02-2026 న దేవస్థాన అర్చకులచే ఘనంగా జరుపబడిన కళ్యాణం అనంతరం సోమవారం ది. 16-02-2026 రాత్రి పారువేట ఉత్సవం, అమ్మవారికి కుంకుమార్చన, ధ్వజావరోహణ జరుపబడినవి. ఈ రోజు అనగా ది. 17-02-2026 న మంగళవారం ఉదయం పూర్ణాహుతి, పుట్నాలు దంచుట, వసంత సేవ కార్యక్రమములు జరుపబడినవి. ఈ కార్యక్రమములో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణఇందిరా దత్తు



తరుపున కె.సి.పి. నుండి ఏ.జి.యమ్. శ్రీ పి. రాంప్రసాద్ మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదేవిధముగా ఈ రోజు అనగా ది. 17-02-2026 రాత్రి దొంగలదోపు ఉత్సవం కార్యక్రమము జరుపబడునని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలియజేసారు.

# చిన్ననాటి నుంచే ఆరోగ్య పథంలో పయనించాలి : జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

ఎన్టీఆర్ జిల్లా/పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 17 : విద్యార్థి దశ నుండే ఆరోగ్య సూత్రాలను పాటించటం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సాధ్యపడుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పెనుగంచిప్రోలు జడ్పి హైస్కూల్ లో విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి 1 – 19 సంవత్సరాల వయసున్న పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. చిన్నారుల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమైన నులి పురుగులను నివారించి ఆరోగ్యవంతమైన ఎదు గుదలకు అల్బెండజోల్ మాత్ర ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

# నంద్యాలలో ఘనంగా మునియార్ ఖలీల్ అహ్మద్ పుట్టినరోజు వేడుకలు

**- ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్**







నేటి శుభోదయ నంద్యాల : నంద్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17 న్యూస్ : నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు నంద్యాల టౌన్ ప్రెసిడెంట్ మునియార్ ఖలీల్ అహ్మద్ గారి పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య ఖలీల్ అహ్మద్ కేక్ కట్ చేసి తన పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ గారు ఖలీల్ అహ్మద్ కు శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ఈరోజు మనందరి ఆత్మీయులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు నంద్యాల టౌన్ ప్రెసిడెంట్ మునియార్ ఖలీల్ అహ్మద్ గారి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని. నంద్యాల పట్టణంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడంలో ఖలీల్ అహ్మద్ గారు అలుపెరగని కృషి చేస్తున్నారని అన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిష్టించాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు ఈ సందర్భంగా మునియార్ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ఈరోజు నా పుట్టినరోజు సందర్భంగా నాకు శుభాకాంక్షలు తెలియజేయడానికి విచ్చేసిన మా ప్రియతమ యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ నాయకత్వంలో నంద్యాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నేను ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి నాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్గా మరియు నంద్యాల టౌన్ ప్రెసిడెంట్గా బాధ్యతలు అప్పగించిన మన గౌరవ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారికి, యువనేత నారా లోకేష్ గారికి, మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారికి మరియు మా నియోజకవర్గ పెద్దలకు ఎప్పుడూ రుణపడి ఉ ంటానన్నారు. నా పుట్టినరోజును ఒక పండుగలా నిర్వహిస్తున్న పార్టీ కౌన్సిలర్లకు, వార్డు ఇంచార్జిలకు, నా శ్రేయోభిలాషులకు మరియు నా ప్రాణసమానమైన కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని. మీరందరూ చూపిస్తున్న ఈ ప్రేమాభిమానాలే నాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయని . ప్రజల సమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా మైనార్టీల సంక్షేమానికి నా వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగార్జున, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పరి సురేష్ కుమార్, దీపక్ రెడ్డి, గోవిందు నాయుడు, బుగ్గ రాముడు, శేఖర్ రెడ్డి, జైలాన్, అజ్మీర్, మారుతి కుమార్, మా భాష, ఎబినేజర్, మజీద్, అక్బర్, షబ్బీర్, అలీ, జాకీర్ , రామ్ మద్దయ్య, బెండకాయల ఇస్మాయిల్, సుబ్బయ్య, హుస్సేన్, గుల్లి, కరిముల్లా, నాగరత్నమ్మ , పద్మ, జోష్ణ, నాగరాజు, సంపంగి జయకృష్ణ మరియు కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ అభిమానులు మరియు ఖలీల్ అహ్మద్ అనుచరులు పాల్గొన్నారు.

# జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో “జాతీయ రహదారి భద్రత వారోత్సవం





కాకినాడ జిల్లా, జగ్గంపేట ఫిబ్రవరి 17 నేటి శుభోదయ : జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రహదారి భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ వై. ఆర్. కె. శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతా జాగ్రత్తలు మరియు సమాజం ఎదుర్కొంటున్న రోడ్డు ప్రమాదాల సమస్యల గురించి వివరించారు. హెల్మెట్ ధరించడం, సిటె బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీ.సి. హెచ్. బాలరాజు, ఐ. క్యూ.ఏ. సి కో–ఆర్డినేటర్ డా. పి.వి.వి. సత్యా నారాయణ , మరియు కెమిస్ట్రీ ఆధ్యాపకులు వి. మల్లికార్జున శర్మ , తెలుగు ఆధ్యాపకులు డా. డి.సత్యలత, గణిత ఆధ్యాపకులు సి. హెచ్. ఝాన్సీదేవి, ఫిజిక్స్ ఆధ్యాపకులు వి. గోపాలకృష్ణ, కామర్స్ ఆధ్యాపకులు డా.జి.సురేశ్ హిస్టరీ అధ్యాపకులు ఆర్. శ్రీను, జువాలజీ ఆధ్యాపకులు పి.శ్రీనివాస రావు, కంప్యూటర్ ఆధ్యాపకులు వి.దేవి ప్రసన్న ఇతర అధ్యపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజానగరం నియోజకవర్గంలో

# సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్ ల పండుగ..!!

**- ఇంటింటికి వెళ్లి స్వయంగా బాధితులకు చెక్కులను అందజేస్తున్న శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి..**





కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా రాజనగరం నియోజకవర్గం సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలో స్థానిక శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో–ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు. అదేవిధంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల లోని బాధితులకు మంజూరైన చెక్కులను కూడా ఆమె ఇంటింటికి వెళ్లి లబ్దిదారులకు అందజేశారు.

**లబ్ధిదారుల వివరాలు –**

ఈరాటి వెంకట గోపి రూ. 82,258 లు – ,
నగేరు సోమరాజు రూ. 30,000 లు –,
ఉగలాపు సత్యనారాయణ రూ.64,995 లు– ,
మద్దాల పోసిరత్నం రూ. 22,714 లు –,
పంతుల సాయి వెంకట రూ. 36,084 లు – ,
ప్రగడ నాగు గారికి రూ. 21,384 లు –,
పంతుల ఆనందరావు రూ. 63,734 లు –,
పుట్టా శివ రామ్ రూ. 35,000 లు –

ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం , బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మండల టిడిపి నాయకులు





గోకవరం–నేటిశుభోదయ, కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, జగ్గంపేట :ఎమ్మెల్యే జ్యోతుల పై విమర్శలు చేసే స్థాయి సూర్యచంద్రకి లేదని చేసిన ఆరోపణలను జగ్గంపేట మార్కెట్ యాడ్ చైర్మన్ అడపా భరత్ బాబు ఖండించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై అసత్య ఆరోపణలు చేసే స్థాయి నీది కాదని, 2019 లో జనసేన పార్టీ నుండి 2024 లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన పాఠం శెట్టి సూర్యచంద్ర జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై చేసిన విమర్శలు సరికాదనీ, చేసిన విమర్శలు వెంటనే వెనక్కి తీసుకోవాలనన్నారు. అభివృద్ధి చేయలేదంటూ చేస్తున్న విమర్శలు లో వాస్తవం లేదని,గత 18 నెలలో నియోజకవర్గం లో కొన్ని వందల కోట్ల రూపాయలు అభివృద్ధి చేసారని, ముఖ్యంగా గోకవరం గ్రామంలో ప్రతి వీధిలోను సిమెంట్ రోడ్ లు వేయించారాని, అంతేకాకుండా తాళ్లూరు పథకం పై చేసిన విమర్శలు సరికాదని,తాళ్లూరు పథకం మోగా ఇంజనీరింగ్ సంస్థ కి 51.67 కోట్లు టెండర్ పద్దతి లో పైప్ లైన్ పనులు ప్రారంభించడానికి సంసిద్ధులై ఉన్నారన్నారు. అంతేకాకుండా సత్య సాయి మంచి నీటి పథకం లో పని చేస్తున్న ఉద్యోగస్తులకు జీతాలు పెండింగ్ ఉన్నాయని, పైప్ లైన్ లు మరమ్మత్తులు కోసం రెండు జిల్లాలలో ఉన్న కలెక్టర్ తో మాట్లాడి మార్చి నెల నాటికీ ప్రజలకు తాగు నీరు అందే విధంగా చర్యలు తిడుకుంటున్నారన్నారు. అభివృద్ధి ద్వేయంగా ముందుకు వెళ్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై విమర్శలు చేయడం సరికాదన్నారు. అదేవిధంగా ఇప్పటికె కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తుందని తెలుసుకొని విమర్శలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల టీడీపీ అధ్యక్షులు పిల్లా చంటిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భారత్ కుమార్, మాజీ సొసైటీ చైర్మన్ దాసరి తమ్మన్న దొర ,మాజీ జడ్పీటీసీ పాలూరి బోసు బాబు,సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము,దేవస్థానం చైర్మన్ బడిరెడ్డి అచ్చన్న దొర, దాసరి సీతరామకృష్ణ, బడిరెడ్డి బాబీ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్,పులపర్తి బుజ్జి,గళ్ళ రాము,తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు నివారించడంలోనే కాదు సమాజ సేవలో కూడా ముందే

**- అగ్నిమాపక శాఖ అధికారి**



గుడివాడ, ఫిబ్రవరి 17( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) అగ్నిప్రమాదాలను నివారించేందుకు ముందుండే అగ్నిమాపక శాఖ సమాజ సేవ చేసేందుకు ముందుకు వచ్చి పేదలకు నిత్యావసర సరకులు,దుప్పట్లను రాష్ట్ర విపత్తుల శాఖ పంపిణి చేయడం అభినందనీయం. అగ్నిమాపక సేవల మహా సంచాలకులు పి. వెంకటరమణ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని రైల్వే, బస్సు స్టాండ్ ప్రాంతంలోని పేదలకు, అనాధలకు, అనాధసారణాలయాల్లో నిత్యావసర సరకులు, దుప్పట్లను అందచేశారు. ఈ సందర్భంగా అగ్నిమా పక శాఖ అధికారి మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడే కాకుండా నిరుపేద, అనాదాశ్రమాలాల్లో నివసించే వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సేవా చేయడం కర్తవ్యంగా భావిస్తున్నామన్నారు.

## గుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

# జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి(ఏ.కె) : తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమాన్ని పాఠశాల నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెల్త్ సూపర్ వైజర్ టి.వి. నాగ ప్రసాద్ మనిలో ఆరోగ్య కార్యకర్త, షేక్ మీరాని, ఆశా, తదితర వైద్య సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతని అవగాహనా కార్య క్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 197 నుంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విద్యార్థులకు హెల్త్ సూపర్ వైజర్ మాట్లాడుతూ.... ప్రతిరోజు దినచర్యలో భాగంగా భోజనానికి ముందు తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుగు కోవాలన్నారు. చేతులకు గోర్లు పెంచుకోవడం వలన నులిపురుగులు వాటితో తినే ఆహారంతో నాయనికి చేరి చిన్న పేగు ద్వారా గుడ్డు పెట్టి కొన్ని రకాల వ్యాధులు సంక్రమ స్తాయని తెలియజేస్తారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఈ అవగాహన కార్యక్రమశీలోని అంశాలను మీ మీ ఇళ్ల వద్ద పెద్దలకు కూడా వివరించాలని, పరిసరాలతో పాటుగా శారీరక పరిశుభ్రత పాటించే జాగ్రత్తలు తెలియజేయాలని విజ్ఞప్తి చేసారు.

### ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై పాఠంశెట్టి సూర్యచంద్ర చేసిన అసత్య ఆరోపణలను

# తీవ్రంగా ఖండించిన జగ్గంపేట మండల టిడిపి నాయకులు

### - జగ్గంపేట నియోజకవర్గం లో సాగునీటి ప్రాజెక్టులకు 190 కోట్లు, రోడ్లకు 66 కోట్లు నిధులు నీకు కళ్ళు కనబడడం లేదా సూర్యచంద్ర ఖబర్దార్



కాకినాడ జిల్లా జగ్గంపేట ఫిబ్రవరి 17 నేటి శుభోదయ : జగ్గంపేట లో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనంలో జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపైన జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ పైన, చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, జగ్గంపేట సొసైటీ చైర్మన్ బుర్రి సత్తిబాబు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, జగ్గంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోదిరెడ్డి శ్రీనివాస్, జగ్గంపేటటౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి మాట్లాడుతూ పాఠం శెట్టి సూర్యచంద్ర తన స్థాయిని పెంచుకోవడానికి జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై అసత్య ఆరోపణలు చేస్తూ పత్రికా సమావేశాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ 190 కోట్లతో ఇరిగేషన్ ప్రాజెక్టులకు, 100 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లు, సిమెంట్ రోడ్లు మౌలిక వసతులకు నిధులు తీసుకొచ్చి తాళ్లూరు ఎత్తిపోతల పథకానికి 52, మల్లవరం ఎత్తిపోతల పథకానికి 130 కోట్లు, మామిడాడలో జ్యోతుల పాపారావు ఎత్తిపోతల పథకంకు 3. 5కోట్లు నిధులు తీసుకురావడం కాకుండా, నాలుగు మండలాల్లో సిమెంట్ రోడ్లు, గ్రామాల లింకు రోడ్లకు 66 కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చారని అంతేకాకుండా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు మౌలిక వసతులు కల్పించడం, రెండు కోట్ల రూపాయలతోఆడబిడ్డలకు పెళ్ళికానుక అందించడం 80 లక్షల రూపాయలతో మెగా డీఎస్సీ ఏర్పాటు చేసి 30 మంది ఉపాధ్యాయుల ఉద్యోగాలు కల్పించడం ఇవన్నీ సూర్యచంద్ర కళ్లకు కనపడటం లేద అని వారు ప్రశ్నించారు. ముఖ్యంగా సత్యమేవ జయతి అని జండా కారు కట్టుకుని తిరగడం కాదని సత్యాన్ని మాట్లాడటం నేర్చుకోవాలని అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మరని శివ కేశవుల కు నిత్యం పూజలు చేసే జ్యోతుల నెహ్రూపై అసత్య ఆరోపణలు చేస్తే ఆ దేవుడే నిన్ను శిక్షిస్తాడని వారు అన్నారు. ఇదే సూర్యచంద్ర పవన్ కళ్యాణ్ దేవుడు అంటూ గతంలో ఇంటింటికి తిరిగి టిడిపి జనసేన బిజెపి కుటమిగా ఏర్పడడంతో తనకు సీటు రాదని అప్పటినుంచి కూటమి పార్టీలపై విషం కక్కుతూ కొంతమందితో కుమ్మక్కై గత ఎన్నికల్లో ఎన్నారైల ద్వారా, అప్పటి అధికార పార్టీ ద్వారా కోట్లాది రూపాయల నిధులు సమకూర్చుకుని ఎన్నికల్లో ఏవిధంగా ఖర్చు పెట్టారో మనందరికీ తెలుసు అని వారు అన్నారు. అభివృద్ధి సాధకులు జ్యోతుల నెహ్రూ రాష్ట్రంలో జగ్గంపేట నియోజకవర్గం 11వ స్థానంలో ఏ ప్లస్ గ్రేడ్ తో ముందుకు వెళుతుంటే అది చూడలేని సూర్యచంద్ర ఇక్కడ అభివృద్ధి జరగడం లేదని అవినీతి జరుగుతుందంటూ అసత్య ఆరోపణ చేయడం విడ్డూరం గా ఉందని వారు అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో మూడు రోజుల్లోనే రెండుసార్లు మాట్లాడి గ్రామాల్లో మైక్రో ఫిల్టర్ ద్వారా మంచినీటిని అందించాలని, జాతీయ రహదారులపై ప్రమాదాల లో గాయపడిన వారిని రక్షించడానికి జగ్గంపేటలో ట్రోమా సెంటర్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందని ఇవి అన్ని సూర్యచంద్ర కి కనపడటం లేదా అని ఆరోపించారు.

# మెదడుకు పదును చదరంగం

### - బాపట్ల ఆర్డిఓ గ్లోరియా అభిప్రాయం




బాపట్ల నేటి శుభోదయ, ఫిబ్రవరి 17 :మెదడుకు పదునుపెట్టే క్రీడల్లో చదరంగం ముందు వరసలో ఉంటుందని బాపట్ల ఆర్డిఓ గ్లోరియా అన్నారు. అటు వంటి క్రీడల్లో రాణించేవారు తెలివైన భావాలతో ఉంటారని పేర్కొన్నారు. బాపట్ల స్టేడియంలో ప్రారంభమైన జిల్లాస్థాయి చదరంగం పోటీల ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. క్రీడల్లో అద్భుతంగా రాణించే వారికి భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు పుష్కలంగా ఉంటాయని అన్నారు. జిల్లాస్థాయి చదరంగం క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఈ సందర్భంగా ఆర్డిఓ అభినందించారు. బాపట్ల తహసిల్దార్ షేక్ షలీమ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన క్రీడల ద్వారా విద్యార్థులు మంచి ఉన్నత భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. చదరంగం క్రీడా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి మాట్లాడుతూ బాపట్ల లోని క్రీడా స్టేడియంను అన్ని విధాల అభివృద్ధి చేసి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ సహకారంతో అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. క్రీడా రంగాన జాతీయస్థాయిలో ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్న క్రీడాకారులను ఈ సందర్భంగా కమిషనర్ అభినందించారు. డి ఎస్ డి ఓ ఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయస్థాయి క్రీడా విజేత అనురాధ రెడ్డి , జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 108 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం

### -గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



గన్నవరం, ఫిబ్రవరి 17 ( అజయ్ నారగాని- నేటి శుభోదయం) ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. ప్రతి మంగళవారం గన్నవరం పార్టీ కార్యాలయంలో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. గన్నవరంలోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఆయన, తక్షణమే పరిష్కరించగలిగే అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన మొత్తం 32 మంది లబ్ధిదారులకు రూ. 21,69,288 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సాయాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. పేదలకు ముఖ్యమంత్రి సహాయానిది ఒక వరమని పేర్కొన్నారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి దొంతు చిన్న, బాపులపాడు మండల టిడిపి అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, విజయవాడ రూరల్ మండల్ టిడిపి అధ్యక్షులు గొడ్డళ్ల చిన్న రామారావు, ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు, రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, బోడపాటి రవికుమార్, పుట్టా సురేష్, మేడేపల్లి రమ, కుందేటి చంద్రశేఖర్, బొప్పన హరికృష్ణ, జనసేన పార్టీ నాయకులు చిమట రవి వర్మ, మరియు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్ 2026 నేషన్ 1 ఫలితాలలో బాపట్ల శ్రీ చైతన్య విద్యార్థులు విజయభేరి




బాపట్ల నేటి శుభోదయ, ఫిబ్రవరి 17 : నేషన్ 1 ఫలితాలలో అత్యధిక పర్సంటైల్ సాధించిన మా విద్యార్థులు. బొమ్మిశెట్టి వరుణ్ సాయి 99.31 , కూణం సాయి మోహన్ మనోజ్ 97.16, జూలాది రామచంద్ర చౌదరి 95.75, ఉడతా కిషోర్ కుమార్ 95.71, మండలి రేవంత్ 94.15, జిడుగు హాసిని 93.54 పర్సంటైల్ తో మరియు వివిధ కేటగిరీలో మొత్తం 49 మంది అర్హత సాధించటానికి అవకాశం అయినది ఈ విజయానికి కారకులైనటువంటి విద్యార్థుల్ని కాలేజీ యాజమాన్యం సంబంధించిన ఎక్స్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మరియు డీన్ యార్లగడ్డ చంద్ర శేఖర్, అసోసిమెంట్ డీన్ పత్తిపాటి మోహన్ రావు మరియు ప్రిన్సిపల్ కన్నేటి వేణుగోపాల్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు మరియు అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# వంద రోజుల ప్రణాళిక అమలు తో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

### - ఎన్. టి. ఆర్. జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ. లక్ష్మీశా - ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొనేలా విద్యార్థులను సన్నద్ధం చేయండి..

### - పదో తరగతి ఉత్తీర్ణతలో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం





విజయవాడ, ఫిబ్రవరి 17 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) పదో తరగతి పరీక్షలకు సంబంధించి వంద రోజుల ప్రణాళిక అమలు తో నూరు శాతం ఫలితాలను సాధించి ఉత్తీర్ణత శాతంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని విద్యార్థులు ధైర్యంగా పరీక్షలను ఎదురుకుని ఉత్తమ ఫలితాలను సాధించడం ద్వారా తల్లిదండ్రుల ఆశలు నేరవేర్చేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఉపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతి పరీక్షల సమయం ఆసన్నమవుతున్న తరుణంలో విద్యార్థుల విద్యా బోదనను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం స్థానిక సూర్యారావుపేటలోని శ్రీ కర్నాటి రామమోహనరావు నగర పాలక సంస్థ ప్రాధమిక పాఠశాలను, పటమటలోని గోవిందరాజు ధర్మఈనాంట్రస్టు నగర పాలక ఉన్నత పాఠశాలను సందర్శించారు. జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించిన సమయంలో పదవ తరగతి విద్యార్థులకు రోజువారి మేధా శక్తిని నిర్వహిస్తున్నారు. పరీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ ముచ్చటిస్తూ విద్యార్థుల మేధా శక్తిని పరిశీలిస్తూ గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ కు సంబంధించి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాదానాలను రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నుండి 11,200 ప్రైవేటు పాఠశాలల నుండి 16,000 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాసేందుకు సన్నద్ధం అవుతున్నారన్నారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరేందుకు లోతైన ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే ఆశించిన ఫలితాలు పొందగలుగుతారన్నారు. ఇష్టపడి నేర్చుకున్న విషయ పరిజ్ఞానం ఎప్పటికీ గుర్తుండి పోతారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎంతో మంది ఉన్నత స్థానాలకు ఎదిగారని అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని కష్టమైనా ఇష్టపడి చదువితే గుర్తుంటాయన్నారు. తమ పిల్లలు తమల కష్టపడకుండా ఉన్నత శికరాలు చేరుకోవాలని సమాజంలో మంచి పేరు తెచ్చుకుని స్థిరపడాలనే ఆశతో ఎంతో మంది తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని రెట్టింపు చేసేలా ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదవ తరగతి పరీక్షలేనని పదవ తరగతి పరీక్ష పాస్ అయితే ఉన్నత చదువులు చదివేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయాలన్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు అయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి వారికి అర్థమయ్యే రీతిలో బోధించి ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే పద్ధతి, ప్రశ్నకు సంబంధించి జవాబు వ్రాసే విధానం వంటి విషయాలను విద్యార్థులకు సూచించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న కీలక సమయంలో ఉపాధ్యాయులు సెలవులు వినియోగించవద్దన్నారు. విద్యార్థులకు వచ్చిన ఫలితాలు ఉపాధ్యాయులపై తల్లిదండ్రులలో గౌరవం పెంపొందేందుకు దోహదపడుతాయని అన్నారు. 10వ తరగతి ఫలితాలలో జిల్లాను అగ్రగామిగ నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల సందర్శనలో జిల్లా కలెక్టర్ వెంట డిఇవో ఎల్. చంద్రకళ, శ్రీ కర్నాటి రామమోహనరావు నగర పాలక సంస్థ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం సూర్యప్రభ, గోవిందరాజు ధర్మఈనాంట్రస్టు ప్రాధానోపాధ్యాయులు మురళ శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సినిమా న్యూస్



## రియల్ లైఫ్ లో వీడికి..రీల్ లైఫ్ లో అతడికి వైఫ్!



నేషనల్ క్రష్ రష్మికా మందన్నా- విజయ్ దేవరకొండ ప్రేమ వివాహం చేసుకుంటోన్న సంగతి తెలిసిందే. మరికొన్ని రోజుల్లోనే భార్యా భర్తలుగా ధాంపత్య జీవితంలోకి అడుగు పెట్టబోతున్నారు. ఇంతకాలం ప్రేమికులుగానే ప్రేక్షకుల్లో ఉన్న జోడీ భార్య భార్తలుగా మారడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. మేడ్ ఫర్ ఈచ్ అదర్ లా హైలైట్ అవుతున్నారు. వివాహం అనంతరం ఆ జంట జీవితం పిల్లా పాపలతో సంతోషంగా సాగిపోవాలని ప్రేక్ష కాభిమానులు కోరుకుంటున్నారు. వివాహం అనంతరం నటులుగా ఇద్దరి కెరీర్ కి సెకెండ్ ఇన్నింగ్స్ ఆరంభం అయినట్లే. అయితే ఇద్దరు ఇంత వరకూ ఏ సినిమాలోనూ భార్య భర్తల పాత్రలో కలిసి నటించలేదు. విజయ్ మాత్రం పలు సినిమాల్లో భర్త పాత్రలు పోషించాడు గానీ.. రష్మిక మాత్రం ఏ సినిమాలోనూ ఏ హీరోకు భార్య పాత్ర పోషించ లేదు. ఆరకంగా రియల్ లైఫ్ లోనూ భార్యపాత్రతో తొలి అనుభవాన్ని ఆస్వాదించబోతుంది. అయితే వివాహం అనంతరం మాత్రం ఓ హీరోకి భార్య పాత్రలో కూడా నటించడానికి సిద్దంగా ఉంది అన్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం అమ్మడు బాలీవుడ్ లో -కాక్ టెయిల్ 2- లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో షాహిద్ కపూర్ హీరోగా నటిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. అయితే ఈ సినిమా అనంతరం మళ్లీ షాహిద్ కపూర్‌కి జోడీగా మరో సినిమాలో రష్మిక నటించబోతుంది. ఈ చాత్రానికి -మైదాన్- ఫేం అమిత్ శర్మ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో షాహిద్ కపూర్ -రష్మికా మందన్నా భార్యా భర్తల పాత్రల్లో కనిపించనున్నారు. ఇదొక సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ చిత్రం. వైవాహిక జీవితంలో గొడవలు పడుతూ విడాకుల దాకా వెళ్ళిన ఒక జంట జీవితంలోకి, ఒక సైంటిఫిక్ ఎక్స్‌పెరిమెంట్ వల్ల ఎలాంటి మార్పులు వచ్చాయి అనేదే ఈ సినిమా కథాంశంగా తెలుస్తోంది. ఇలాంటి పాయింట్ తో ఇంత వరకూ ఏ సినిమా తెరకెక్కలేదు. భార్య భర్తల బంధం మధ్యలో సైన్స్ ఫిక్షన్ జోడించడం అన్నది ఇంట్రెస్టింగ్ ఫ్యాక్టర్ గా చెప్పొచ్చు. గతంలో శంకర్ -రోబో- తో ఇద్దరు ప్రేమికుల ఎడబాటును పాక్షికంగా హైలైట్ చేసాడు. రజనీకాంత్ రోబో సినిమాలో సైంటిస్ట్. అందులో హీరోయిన్ గా నటించిన ఐశ్వర్యారాయ్ ప్రియుడి ప్రేమను కోరుకుంటుంది. కానీ ల్యాబ్ లో నిత్యం ప్రయోగాలతో బిజీగా ఉండే డాక్టర్ ని అర్దం చేసుకోవడంలో ప్రియురాలు విఫలమవుతుంది. దీంతో ఇద్దరి మధ్య చిన్నపాటి గ్యాప్ ఏర్పడుతుంది. కానీ ఆ సన్నివేశాల్ని ఎంతో అందంగా, కొంటెంగా శంకర్ చూపించాడు. అమిత్ శర్మ మాత్రం భార్యభర్తల పాత్రల మధ్యలోనే కొత్త కోణాన్ని చెప్పబోతున్నాడు.

## మెగా హీరోతో మారుతి కామెడీ థ్రిల్లర్?



కెరీర్ ప్రారంభంలో చిన్న బడ్జెట్ ఇనిమాలతో బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టించిన డైరెక్టర్ మారుతి. కేవలం రూ.54 లక్షల బడ్జెట్‌తో -ఈరోజుల్లో- మూవీని రూపొందించి రూ.10 కోట్లకు పైనే వసూళ్లని రాబట్టి అందరిని ఔరా అనిపించాడు. బస్‌స్టాప్, భలే భలే మగాడివోయ్, ప్రేమకథా చిత్రమ్, మహాను భావుడు వంటి సినిమాలతో వండర్స్ క్రియేట్ చేశాడు. ఇందులో నానితో రూపొందించిన -భలే భలే మగాడివోయ్- పది కోట్ల లోపు బడ్జెట్‌తో నిర్మిస్తే ఊహించిన స్థాయిలో లాభాల్ని తెచ్చి పెట్టింది. కేవలం రెండే రెండు కోట్లతో తీసిన-ప్రేమ కథా చిత్రమ్- ఏకంగా రూ.20 కోట్లు తెచ్చి పెట్టింది. చిన్న సినిమాలతో భారీ లాభాల్ని అందించి దర్శకుడిగా ఇండస్ట్రీలో ప్రత్యేకతను చాటుకున్నాడు. చిన్న బడ్జెట్ సినిమాలతో అద్భుతాలు సృష్టించిన మారుతి పెద్ద స్టార్‌ల కోసం పరుగెత్తే క్రమంలో దెబ్బలు తినడం మొదలు పెట్టాడు. విక్టరీ వెంకటేష్‌తో -బాబు బంగారం-, అక్కినేని నాగచైతన్యతో చేసిన -శైలజారెడ్డి అల్లుడు-, మ్యాచో మ్యాన్ గోపీచంద్‌తో చేసిన-పక్కా కమర్షియల్- వంటి సినిమాలు ఇందుకు బిగ్ ఎగ్జాంపుల్‌గా నిలిచాయి. నాలుగేళ్లు టైమ్ తీసుకుని పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో చేసిన కామెడీ హారర్ థ్రిల్లర్ -రాజాసాబ్- కూడా ఇదే ఫలితాన్ని అందించి షాక్ ఇచ్చింది. అనుకున్న కథని అనుకున్న విధంగా తెరపైకి తీసుకెళ్లి ఉంటే మరో -ప్రేమకథా చిత్రమ్- తరహాలో -ది రాజాసాబ్- బ్లాక్ బస్టర్ అనిపించుకునేది. కానీ అది జరగకపోవడం వల్లే సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ ఫ్లాప్‌గా నిలిచి డైరెక్టర్‌గా మారుతి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. దీంతో మళ్లీ మారుతి తన పాత స్కూల్ స్టైల్లోనే కామెడీ థ్రిల్లర్‌తో ప్రేక్షకులని ఎంటర్‌టైన్ చేయడానికి రెడీ అవుతున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. -ది రాజాసాబ్- తరువాత మారుతి మెగా హీరోతో సినిమా చేయబోతున్నాడని వార్తలు షికారు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, తాను త్వరలోనే తన నెక్ట్స్ ప్రాజెక్ట్ గురించి ప్రకటిస్తానని మారుతి ఇటీవల వెల్లడించారు. కానీ మెగా హీరోతో మాత్రం ప్రాజెక్ట్ చేస్తున్నట్టుగా ప్రకటించలేదు. అయినా సరే మారుతి ప్రాజెక్ట్‌పై వార్తలు ఆగడంలేదు జోరుగానే వినిపిస్తున్నాయి. డైరెక్టర్ మారుతి తన నెక్ట్స్ మూవీని మెగాహీరో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌తో చేయబోతున్నాడని, ఇప్పటికే తనని ఫైనల్ చేసుకున్నాడని, ఈ మూవీని మైత్రీమూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్నారని తెలిసింది. ఈ సారి కూడా మారుతి కామెడీ థ్రిల్లర్ స్టోరీనే ఈ మూవీకి ఎంచుకున్నాడట. ఈమూవీతో మళ్లీ మ్యాజిక్ చేసి ట్రాక్‌లోకి వచ్చేస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.

## స్టార్ బాయ్ సిద్దూ జాగ్రత్త పడుతున్నాడా?



టాలీవుడ్ యంగ్ హీరోస్ ఈ మధ్య కొత్త దారి వెతుక్కుటున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకున్నట్టు టైమ్ ఉండగానే ప్రత్యామ్నయ మార్గాలని ఎంచుకుంటున్నారు. -అందాల రాక్షసి- మూవీతో హీరోగా మంచి పేరు తెచ్చుకున్న నవీన్ చంద్ర తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేస్తూ అప్పుడప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మెరుస్తూ వస్తున్నాడు. అంతే కాకుండా ఓటీ ప్లాట్ ఫామ్‌లలోనూ సిరీస్‌లు, క్రైమ్ థ్రిల్లర్‌లు చేస్తూ లైమ్ లైట్‌లో ఉంటున్నాడు. ఇప్పుడు ఇదే పంథాని మిగతా యంగ్ హీరోలు కూడా ఫాలో అవుతున్నారు. -సూపర్ సుబ్బు-తో సందీప్ కిషన్ ఓటీటీ బాటపడుతుండగా, ఆనంద్ దేవరకొండ -తక్షకుడు- మూవీతో డైరెక్ట్ ఓటీటీ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు వీరి తరహాలోనే స్టార్ బాయ్ సిద్దూ జొన్నలగడ్డ కూడా జాగ్రత్త పడుతుననట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. -డీజే టిల్లు- మూవీతో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకున్న సిద్దూ జొన్నలగడ్డ ఆ తరువాత -టిల్లూ స్క్వేర్-తో మరో హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే -డీజే టిల్లు- స్థాయిలో మాత్రం ఆడియన్స్‌ని సంతృప్తి పరచలేకపోయాడు. ఆ తరువాత చేసిన స్పై కామెడీ -జాక్-, రొమాంటిక్ డ్రామా -తెలుసు కదా- బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందించలేకపోయాయి. ప్రస్తుతం మరో క్రేజీ మూవీ చేస్తున్నా మళ్లీ టిల్లూ ఫ్రాంఛైజీనే నమ్ముకున్నాడు. -టిల్లూ క్యూబ్- అనే టైటిల్‌తో మరో సినిమాకు శ్రీకారం చుట్టాలనుకుంటున్నాడు. దీనికి ముందు ఓ వెబ్ సిరీస్‌ని పూర్తి చేయాలని ప్లాన్ చేసుకుంటున్నాడు. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ కోసం సరికొత్త కథతో ఓ వెబ్ సిరీస్ రూపొందబోతోంది. దీనికి యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించనున్నాడు. ఇప్పటికే దీనికి సంబంధించిన చర్చలు పూర్తయ్యాయి. త్వరలోనే అధికారికంగా ఈ ప్రాజెక్ట్‌ని నెట్ ఫ్లిక్స్ వర్గాలు ప్రకటించనున్నాయి. ఇది సిద్దూ నటించే తొలి వెబ్ సిరీస్ కావడం గమనార్హం. దీంతో ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్న స్టార్ బాయ్ అక్కడ సక్సెస్ అయితే మరిన్ని సిరీస్‌లు చేయాలనే ఆలోచనలో ఉన్నాడట. ఇక్కడ జీరో అయితే అక్కడ హీరో కావచ్చని ఇప్పటి వరకు నవీన్ చంద్ర లాంటి హీరోలు నిరూపించడంతో సిద్దూ జొన్నలగడ్డ ఆ వైపుగా అడుగులు వేస్తున్నాడట. ప్రస్తుతం సిద్దూ జొన్నలగడ్డ -బదాస్- మూవీ చేస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీకి రవికాంత్ పేరుపు దర్శకుడు. ఇక డైరెక్టర్ వెంకీ అట్లూరి కూడా కోలీవుడ్ స్టార్ సూర్య హీరోగా ఓ బారీ మూవీని రూపొందిస్తున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ మూవీకి -విశ్వనాథం అండ్ సన్స్- అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారు. మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుఈ మూవీలోని కీలక పాత్రల్లో రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సమ్మర్‌కు రిలీజ్ కానుంది.

## ‘దేవర 2’ షూటింగ్‌పై మళ్లీ ఊహాగానాలు!



రాజమౌళి వంటి స్టార్ డైరెక్టర్ తరువాత అపజయమెరుగని డైరెక్టర్ అనిపించుకున్నాడు దర్శకుడు కొరటాల శివ.రైటర్‌గా నాలుగు సక్సెస్‌ఫుల్ సినిమాలకు పని చేసిన కొరటాల శివ -మిర్చి-తో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుని తొలి మూవీతోనే స్టార్ డైరెక్టర్ల జాబితాలోకి చేరిపోయాడు. యూవీ క్రియేషన్స్‌కిది ఫస్ట్ మూవీ. అలాగే మైత్రీ మూవీ మేకర్స్‌ని -శ్రీమంతుడు- సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం చేసి తొలి మూవీతోనే వారికి బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించారు. అప్పటి వరకు వరుస ఫ్లాపుల్లో ఉన్న సూపర్ స్టార్ మహేష్‌కు ఈ మూవీతో సూపర్ సక్సెస్‌ని అందించి మళ్లీ ట్రాక్‌లోకి తీసుకొచ్చారు. ఎన్టీఆర్‌తో -జనతా గ్యారేజ్-, మహేష్ బాబుతో -భరత్ అనే నేను- వంటి బ్లాక్ బస్టర్లని అందించి అప్పటి వరకు నాలుగు సూపర్ హిట్‌లని అందించి అపజయమెరుగని డైరెక్టర్ అనిపించుకున్నాడు. మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్‌తో చేసిన -ఆచార్య- ఆ ట్యాగ్‌ని బ్రేక్ చేసింది. డైరెక్టర్‌గా కొరటాలకు బిగ్ షాక్ ఇచ్చింది. ఇద్దరు స్టార్లు నటించిన -ఆచార్య- బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్ అనిపించుకుని అభిమానులతో పాటు సినీ లవర్స్‌ని షాక్‌కు గురి చేసింది. ఇలాంటి టైమ్‌లో ఉన్న కొరటాల శివ..యంగ్ టైగర్ ఎన్టీఆర్‌తో చేసిన యాక్షన్ డ్రామా -దేవర-. మెన్ ఆఫ్ యాక్షన్ ఎన్టీఆర్‌ని రెండు విభిన్నమైన క్యారెక్టర్లలో చూపించిన ఈ మూవీ భారీ వసూళ్లని రాబట్టినా -ఆర్ఆర్ఆర్- తరువాత ఎన్టీఆర్‌కు ఏర్పడిన క్రేజ్‌ని మాత్రం మ్యాచ్ చేయలేకపోయింది. హిట్ టాక్‌ని సొంతం చేసుకున్నా కానీ ఎన్టీఆర్ అభిమానుల్ని, సినీ లవర్స్‌ని ఆశించిన స్థాయిలో సంతృప్తిపరచలేకపోయింది. దీంతో -దేవర- సీక్వెల్ ఉంటుందా? అనే అనుమానాలు సర్వత్రా వినిపించాయి. దానికి తోడు ఎన్టీఆర్ ఇతర ప్రాజెక్ట్‌లలో బిజీగా ఉండటంతో ఇక -దేవర- సీక్వెల్ కష్టమనే సంకేతాలు బలపడ్డాయి. ఈ నేపథ్యంలో -దేవర 2- ఖచ్చితంగా ఉంటుందని, దీనికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని, పవంబర్ నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుందని మేకర్స్ ప్రకటించి ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న రూమర్‌లకు చెక్ పెట్టే ప్రయత్నం చేశారు.

Printed published and owned by Gongura srinivasara Rao. 41-29/6-76 RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRAPRADESH - 520013